ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రాజీవ్ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న జిల్లా ఆరోగ్యశ్రీ ఉద్యోగులు

కామారెడ్డి, సెప్టెంబర్ 20 : ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం రాజీవ్ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వానికి ఇప్పటికైనా కనువిప్పు కలగాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్య మిత్రాలు 16 ఏండ్ల నుంచి చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నామని అన్నారు. జీవో 60 ప్రకారం జీతాలు తక్షణమే పెంచాలని, సమాన పనికి వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ఆరోగ్యశ్రీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అల్లావుద్దీన్, గంగాధర్, క్రాంతి కిరణ్ గౌడ్, లక్ష్మారెడ్డి, స్వామిరెడ్డి, అంజయ్య, మహేందర్, జయవర్ధన్, రాజు, మహేశ్, నర్సవ్వ, పద్మ, వినోద, కాశమని, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్‌లో ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాలో 351 కేంద్రాల ఏర్పాటు
- 5.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, సెప్టెంబర్ 20 : జిల్లాలో 351 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి, అక్టోబర్ రెండోవారంలో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తామని కలెక్టర్ ఆశీస్ సంగ్వాన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఐకేపీ ఆధ్వర్యంలో 23, సహకార సంఘాల ఆధ్వర్యంలో 328 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ముందస్తుగా అధికారులు కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలని సూచించారు. జిల్లాలో 5.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.22 03, సాధారణ గ్రేడ్‌కు క్వింటాలుకు రూ.2,183 చెల్లించనున్నట్లు తెలిపారు. గన్నీ సంచులు, ప్యాడీ క్లీనర్స్, టార్పాలిన్లు సిద్ధం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీటి వసతి, టెంటు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్డీవో సురేందర్, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, సివిల్ సప్లై మేనేజర్ రాజేందర్, సహాయ సివిల్ సప్లై అధికారి నరసింహారావు, జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్, డీటీసీ శ్రీనివాస్ రెడ్డి, డీసీవో రామ్మోహన్, జిల్లా మార్కెటింగ్ అధికారిణి రమ్య, అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

ప్రతి ఒక్కరూ సహకరించాలి

బాన్సువాడ, సెప్టెంబర్ 20 : పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్మన్ గంగాధర్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ నిర్వహణ 2024లో భాగంగా పట్టణంలోని పార్కులో పచ్చదనం, పారిశుద్ధ్యం నిర్వహణ కార్యక్రమం చేపట్టారు. పార్కులో మున్సిపల్ చైర్మన్ సిబ్బందితో కలిసి శ్రమదానం చేశారు. అనంతరం పట్టణంలో చికెన్, మటన్ విక్రయించే దుకాణాదారులతో మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. వ్యర్థాలను మున్సిపల్ నుంచి వచ్చే వాహనంలో వేయాలన్నారు. పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, మేనేజర్ మల్లికార్జున్ రెడ్డి, కౌన్సిలర్లు కనుకుట్ల రాజు, లింగమేశ్వర్, హకీం, ఉదయ్ గుప్తా, రమేశ్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, సెప్టెంబర్ 20 : జిల్లాలో విశిష్ట సేవలందిస్తున్న వయోవృద్ధులు, సంస్థలకు అక్టోబర్ 1వ తేదీన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి బావయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలోగా హైదరాబాద్‌లో ని మలక్‌పేట్‌లో ఉన్న నల్గొండ క్రాస్ రోడ్డు బస్‌స్టాప్ పక్కన దివ్యాంగుల సంక్షేమ భవన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అప్లికేషన్ ఫారం, పురస్కారాల కేటగిరీ కోసం అర్హత, ఇతర వివరాలకు www.dsc.telangana. gov.in వెబ్‌సైట్‌లో చూడాలని తెలిపారు.

వలంటీర్లకు సన్మానం

బాన్సువాడ, సెప్టెంబర్ 20 : పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో మసీద్ కమిటీ సభ్యులు కమ్యూనిటీ మేడియేషన్ వలంటీర్లకు శాలువా కప్పి, పూల మాలలు వేసి శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా మెడియేషన్ వలంటీర్లు మాట్లాడుతూ తెలంగాణ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు శిక్షణ తీసుకున్నామని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో కమ్యూనిటీల్లో వచ్చే తగాదాలా పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మేడియేషన్ వలంటీర్లు నాగులగామ సాయిబాబా, ఏర్వాల రామకృష్ణారెడ్డి, హైమ ద్ హుస్సేన్, అయ్యాల సంతోష్, పుష్పావతితోపాటు మసీద్ కమిటీ సభ్యులు అహ్మద్, అబ్దుల్ రెహ్మాన్, ఉస్మా న్, ఖుద్దుస్, షేక్ అయాన్, అజార్ తదితరులు ఉన్నారు.

మోటర్లకు కెపాసిటర్లు బిగించుకోవాలి

రాజంపేట్, సెప్టెంబర్ 20 : మండలంలోని కొండాపూర్‌లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రైతు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతూ.. మోటర్లకు కెపాసిటర్లను బిగించుకోవాలన్నారు. స్టార్టర్ డబ్బాలు ఇనుపవి కాకుండా పీవీసీ డబ్బాలను ఉపయోగించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ కళ్యాణ్ చక్రవర్తి, ఏడీఈ కిరణ్ చైతన్య, ఏఈ మారుతి, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కామారెడ్డి, సెప్టెంబర్ 20 : ఈ నెల 28వ తేదీ నిర్వహించనున్నట్లు జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సింధూశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ పడ దగిన కేసుల్లో జిల్లాలోని అన్ని కోర్టులో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా, ఆస్తి విభజన, వైవాహిక జీవితానికి సంబంధించిన, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ తదితర కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని సూచించారు. రాజీ మార్గం రాజ మార్గమని, చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకొని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని, కోర్టులు, న్యాయస్థానాలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ధాన్యం లారీ విడుదల

నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 20 : ఈ నెల 17వ తేదీన పట్టుకున్న ధాన్యం లారీని శుక్రవారం విడుదల చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ షరీఫ్ తెలిపారు. బీర్కూర్‌లో అనుమానంతో లారీని స్థానికులు పట్టుకుని పోలీసులకు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అప్పగించగా అధికారులు లారీని సీజ్ చేశారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఆదేశించారు. వారు విచారణ చేపట్టగా నిజామాబాద్ జిల్లా వర్ని గ్రామానికి చెందిన అశోక్ అనే వ్యక్తి కల్లాలి గ్రామంలో ఒక రైతు వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేశాడు. ఆ ధాన్యాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని పెద్దాపురం గ్రామానికి తరలించే క్రమంలో బీర్కూర్ గ్రామస్తులు పట్టుకున్నారని, దీనిపై విచారణ చేపట్టగా సీఎంఆర్ ధాన్యం కాదని నిర్ధారించి అదనపు కలెక్టర్ ఆదేశానుసారం విడుదల చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ తెలిపారు.

తల్లిదండ్రులు సహకరించాలి

కామారెడ్డి రూరల్, సెప్టెంబర్ 20 : కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రగతిని నెలవారీగా అంచనా వేసి వారి సామర్థ్యాన్ని పెంపొందించడానికి తల్లిదండ్రులు సహకరించాలని సెక్టోరియల్ అధికారి వేణు శర్మ అన్నారు. శుక్రవారం పాఠశాలలో సమావేశం నిర్వహించారు. క్రమం తప్పకుండా విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యయుడు సాయిరెడ్డి పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు

కామారెడ్డి, సెప్టెంబర్ 20 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో టీఎన్జీవోస్ కేంద్ర సంఘం పిలుపు మేరకు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని పలువురు ఉద్యోగులు టీఎన్జీవోస్ సభ్యత్వం తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కేంద్ర సంఘం కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, రాజేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్‌కుమార్, ఈసీ మెంబర్ శాంతయ్య, జిల్లా పంచాయతీ అధికారి, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కామారెడ్డి, సెప్టెంబర్ 20 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాబృందంతో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. షీటీం, సైబర్ క్రైం, రోడ్ సేఫ్టీ, బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు, షీటీం, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య

బీబీపేట్, సెప్టెంబర్ 20 : జీవితంపై విరక్తితో ఒకరు మృతి చెందిన ఘటన బీబీపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన శ్యాగ శ్రీనివాస్(48) అప్పుల బాధతో జీవితంపై విరక్తితో ఉరేసుకొని మృతి చెందాడు. మృతుడి భార్య శ్యాగ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

బోరు ప్రారంభం

కామారెడ్డి, సెప్టెంబర్ 20 : పట్టణంలోని 46వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూప్రియ శుక్రవారం బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలో ఉన్న నీటి సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో బోరును వేయించామన్నారు. మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్ కన్నయ్య, నాయకులు శ్రీనివాస్, రవి, హుస్సేన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత

గజ్యానాయక్‌తండాలో పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

మాచారెడ్డి/బాన్సువాడ రూరల్/నస్రుల్లాబాద్/బీబీపేట్, సెప్టెం బర్ 20 : పరిసరాలను శుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. పాల్వంచ మండలం ఆరేపల్లిలోని కస్తూర్బా గాంధీ వసతి గృహాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. వసతి గృహంలో నీరు నిల్వ లేకుండా చూడాలని అన్నారు. అనంతరం భవానీపేటతండా, గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట ఎంపీడీవో గోపీబాబు, ఎంపీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. బాన్సువాడ మండలం తిర్మలాపూర్ ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో బషీరుద్దీన్ సందర్శించారు. పాఠశాల ఆవరణను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలోని నల్లాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో తిరుగుతూ ఫ్రైడే డ్రై డే గురించి వివరించారు. ఆయన వెంట ఎంపీవో సత్యనారాయణరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి అవినాశ్, ఏఎన్ఎం, ఆశ కార్యక ర్తలు ఉన్నారు. నస్రుల్లాబాద్ మండలం సంగం గ్రామంలో ఎంపీవో సూర్యకాంత్ ఇంటింటికీ తిరుగతూ పరిసరాలను పరిశీలించారు. బీబీపేట మండలం కోనాపూర్ గ్రామంలో మండల ప్రత్యేకాధికారి సతీశ్ యాదవ్ పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. డ్రైడే ఫ్రైడే సందర్భంగా మొక్కలకు నీళ్లు పోశారు. గ్రామంలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి భరత్‌కు సూచించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్, సీసీ రాజేశ్వర్ రెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్ తనిఖీ

కామారెడ్డి, సెప్టెంబర్ 20 : భిక్కనూర్ సమీపంలోని విజయ గణపతి రైస్ మిల్‌ను హైదరాబాద్‌కు చెందిన టాస్క్‌ఫోర్స్ పౌరసరఫరాల శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, బస్తాలను సరిచూసుకున్నారు. ఈ సందర్భంగా వారు ధాన్యం వివరాలను యజమానులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం పక్కదారి పడితే సహించేది లేదని హెచ్చరించారు. తక్షణమే మిల్లింగ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, కిష్టయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కామారెడ్డి, సెప్టెంబర్ 20 : పట్టణానికి చెందిన రవికుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ నిమ్స్ దవాఖాన డాక్టర్‌తో మాట్లాడారు. రవి చికిత్స కోసం ప్రభుత్వం తరపున రూ.2 లక్షల ఎల్వోసీని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు.

విజయ డెయిరీ పాల బిల్లులు చెల్లించాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

రామారెడ్డి, సెప్టెంబర్ 20: విజయ డెయిరీలో పాలుపోసే రైతులకు బిల్లులు చెల్లించాలని బీఆర్ఎస్ నాయకుడు, సదాశివనగర్ మాజీ జడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలువురు బీఆర్ఎస్ నాయకులతో కలిసి శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సన్నపల్లి డెయిరీ పరిధిలో ఏడు వేల మంది రైతులు విజయ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్నారని తెలిపారు. వారికి నాలుగు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మొత్తం రూ.కోటీ 50లక్షలు రావాల్సి ఉందని, ప్రభుత్వం కుట్ర పూరితంగా బిల్లుల చెల్లింపులను నిలిపివేసి, ప్రైవేటు డెయిరీలకు కొమ్ము కాస్తున్నదని ఆరోపించారు. బిల్లులు చెల్లించకపోవడంతో పశువుల దాణాకు కష్టంగా మారిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 15రోజులకు ఒకసారి పాల బిల్లులు చెల్లించేవారని గుర్తుచేశారు. సమావేశంలో రామారెడ్డి మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, కాలభైరవ స్వామి ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు గంజి సతీశ్ గుప్తా, బీసీ నాయకుడు కలాలి సాయాగౌడ్, నాయకులు పడిగెల శ్రీనివాస్, రాజేందర్, లింబాద్రి నాయక్, కిరణ్‌కుమార్‌రెడ్డి, రెడ్డి మల్లేశ్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దు

యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ సోమనాథం

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ సోమనాథం

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 20: మత్తు పదార్థాలకు అలవాటు పడితే విద్యార్థులు తమ జీవితాన్ని కోల్పోవాల్సి వస్తుందని యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ సోమనాథం హితవు పలికారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి, మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. క్షణికానందం కోసం మత్తుపదార్థాలకు అలవాటుపడితే.. జీవితంలో సాధించాలనుకున్న లక్ష్యాలు కలగానే మిగిలిపోతాయన్నారు. విద్యార్థుల విజయంపై వారి కుటుంబ భవిష్యత్తు ఆధారపడి ఉందని, తల్లిదండ్రుల ఆశలను నీరుగార్చవద్దని సూచించారు. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు అమ్మినా, వినియోగించినా నేరమన్నారు. తల్లిదండ్రులు పిల్లల అలవాట్లు, కదలికలను గమనిస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై బొజ్జ మహేశ్, కళాశాల ప్రిన్సిపాల్ శంకరయ్య, టీఎస్ నార్కొటిక్స్ ఎస్సై నర్సింహులు, ఎన్ఎస్ఎస్-1 ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణ ప్రసాద్, అధ్యాపకులు సిద్ధిరాజు, గంగారెడ్డి, నాగనిక, అరుణ్‌కుమార్, సురేశ్‌రెడ్డి, రాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

బాండ్‌ను అందజేస్తున్న మల్లేశ్‌రెడ్డి మిత్రులు

రామారెడ్డి, సెప్టెంబర్ 20: రామారెడ్డికి చెందిన ఒంటరి మల్లేశ్‌రెడ్డి ఉపాధి కోసం దుబాయి వెళ్లాడు. అక్కడ అనారోగ్యానికి గురై మార్చి నెలలో మరణించాడు. పేద కుటుంబం కావడంతో అతడితో చిన్నప్పుడు చదువుకున్న స్నేహితులు, హైందవ సేనా యూత్ సభ్యులు అండగా నిలిచారు. మల్లేశ్‌రెడ్డి కూతురు పేరుతో రూ.1,39,00 పోస్టాఫీసులో డిపాజిట్ చేశారు. అందుకు సంబంధించిన బాండ్ పేపర్లను బాధిత కుటుంబీకులకు గురువారం రాత్రి అందజేశారు. కార్యక్రమంలో మల్లేశ్‌రెడ్డి మిత్రులు పాల్గొన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ మండల కమిటీ ఏర్పాటు

లింగంపేట, సెప్టెంబర్ 20: భారతీయ కిసాన్ సంఘ్ లింగంపేట మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యవర్గ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి కమిటీని ఎన్నుకున్నామన్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా ఏలాల సాయిరెడ్డి(మోతె), ఉపాధ్యక్షుడిగా ఆకుల బాల్‌రాజ్ (శెట్పల్లిసంగారెడ్డి), ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్ గౌడ్ (కోర్పోల్), కార్యవర్గ సభ్యులుగా నారాయణ (లింగంపల్లి), రవీందర్ (బాయంపల్లి) గోపాల్ (బాణాపూర్), లక్ష్మారెడ్డి (ముస్తాపూర్), సాయిలు (శెట్పల్లిసంగారెడ్డి), కాంతారెడ్డి (సురాయిపల్లి), ప్రభురాజు (పర్శళ్ల), శ్రీనివాస్ (పర్శళ్ల), బాల్‌రాజు (కన్నాపూర్), బ్యాగరి సాయిలు (కోర్పోల్), రాజేశ్వర్ రావు (మోతె), పోశయ్య (కోర్పోల్), రాజు (కోర్పోల్), కాంత్‌రెడ్డి(ముస్తాపూర్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ మండల మాజీ అధ్యక్షుడు ఆకుల రాజయ్య, సీజీఆర్ఎఫ్ సభ్యుడు రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెద్దకొడప్‌గల్, సెప్టెంబర్ 20: పిట్లంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు శుక్రవారం సందర్శించారు. ప్రిన్సిపాల్ రబ్బానీ పాఠశాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అద్దె గదులు, డ్రైనేజీ, తాగునీటి ఇబ్బందులను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా చూస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

భర్తపై హత్యాయత్నం

- దొంగలు దాడిచేశారని భార్య బుకాయింపు
- బంజారా తండా కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలను వెల్లడించిన ఎల్లారెడ్డి సీఐ

వివరాలను వెల్లడిస్తున్న ఎల్లారెడ్డి సీఐ రవీందర్

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 20: కట్టుకున్న భర్తను మట్టుబెట్టేందుకు యత్నించిన ఓ వివాహిత.. దొంగలు దాడి చేశారని పోలీసులను నమ్మించే ప్రయత్నం చేసింది. పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టి భార్యనే హత్యాయత్నం చేసినట్లు గుర్తించి, ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

మండలంలోని బంజారా తండాకు చెదిన దరావత్ మోహన్‌పై ఈనెల 18న తెల్లవారుజామున దాడి జరిగింది. గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు మాస్కులు ధరించి దాడి చేశారని, తన నగలతోపాటు బీరువాలోని నగదును ఎత్తుకెళ్లారని మోహన్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ వివరాలు సేకరించగా.. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. పలువురిని అదుపులోకి తీసుకొని విచారించారు. మోహన్ భార్య నిర్మలనే హత్యాయత్నం చేసినట్లు నిర్ధారించారు. దీంతో ఆమెను అదుపులోకి తీసుకొని విచారించగా.. నేరం అంగీకరించింది. భర్త అనారోగ్యం కారణంగా తనకు సంసార సుఖం లేదని, అడ్డు తొలగించుకునేందుకు తానే అతడిని చంపేందుకు కుట్ర పన్నినట్లు తెలిపింది. దీంతో శుక్రవారం ఉదయం ఆమెను గోపాల్‌పేట బస్టాండ్ సమీపంలో పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. నిర్మలపై సెక్షన్ 109 ప్రకారం అటెమ్ట్ మర్డర్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. తీవ్ర గాయాలైన మోహన్‌కు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి స్థిమితంగా ఉన్నదన్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ బానోత్ గంగారామ్‌ను సీఐ రవీందర్, నాగిరెడ్డి ఎస్సై మల్లారెడ్డి అభినందిస్తూ.. రివార్డును అందజేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

వెంటనే కావలెను
★అనఘా లక్ష్మి షాపింగ్‌మాల్‌లో పర్మినెంట్‌గా పనిచేయుటకు 1) సూపర్వైజర్స్ (M/F) అర్హత: డిగ్రీ, 2) అనుభవం గల ఎలక్ట్రీషియన్ అర్హత: (డిప్లమా ఎలక్ట్రికల్) & 3) కంప్యూటర్ ఆపరేటర్ (M/F) అర్హత: ఇంటర్/డిగ్రీ, ఆసక్తి గలవారు వెంటనే ID ప్రూఫ్, ఫోటోతో నేరుగా సంప్ర॥: అనఘా షాపింగ్ మాల్, R.P రోడ్, NZB.
NTZ-334454

CHANGE OF NAME
★I, MANUBUL NAVEEN KUMAR (old name) S/o. MANUBUL GANGADHAR Changed my name as CHENCHULA NAVEEN KUMAR (New Name) S/o. CHENCHULA GANGADHAR R/o. H.no.6-94, Vill: Dupally, Mdl: Renjal, Dist.Nizamabad.
NTZ-340291

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331771-All

వెంటనే కావలెను
★వ్యవసాయరంగంలో అనుభవం మరియు డ్రోన్ స్ప్రే యొక్క ప్రాముఖ్యతను రైతులకు వివరించి ఒప్పించగలిగే నైపుణ్యం కలిగిన ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ప్రదేశం: సంగారెడ్డి, కామారెడ్డి, సం॥ సెల్: 9032527297
NTZ-334401

వెంటనే కావలెను
★Small/Medium తరహా DGCA సర్టిఫికేట్ కలిగి ఉండి 1 సంవత్సర అనుభవం కలిగిన అగ్రిడ్రోన్ పైలట్ కావలెను. విద్యార్హత ఇంటర్మీడియట్ / డిగ్రీ కలిగినవారు సంప్రదించండి సెల్: 9032527297
NTZ-334402

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌ